# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

**ముత్యాలవాన**

వీధిలో నడుస్తున్నాను.

మట్టిలో నడుస్తున్నాను. దుమ్ము రేపుకుంటూ, ధూళి తోసుకుంటూ నడుస్తున్నాను.

ఆ మట్టి... ఆ దుమ్ము... ఆ ధూళి... ఆ దువ్వ అందులో వున్నాయి లక్ష కథలు. అందులో అణిగి మణిగి రేణువులై ఉన్నాయి కోటి బతుకులు.

వేవేరుల కథలు, దేవతల కథలు, వూళ్ళేలినవాళ్ళ కథలు, ఊరేగినవాళ్ళ కథలు, అడుక్కు తిన్నవాళ్ళ కథలు, అర్థాకలిగాళ్ళ కథలు, ఆశలు తీరని కథలు, చెట్టు కొమ్మెక్కిన కథలు, నక్షత్రాలైన కథలు, పక్షి కథలు, పావురాళ్ళ కథలు — అన్నీ మనుషుల గాథలే... ఎన్నో ఉన్నాయి ఆ మన్నులో...

ఎదురు గాలి దుమారం!

నిలువెత్తు లేచిన దుమ్మూ దూగరా!

ఆ మట్టే తిట్టుకుంటోంది. ఆ దుమ్ము మూలుగుతోంది. ఎదటివాడి కళ్ళలో దుమ్ము కొడ్తే, వాడూ కొడ్తాడు. కళ్ళు గర గర! కడుపు చుర చుర!

ఎల్లయ్య అవసరమై పుల్లయ్య దగ్గరకి బాకీ కెళ్తే ఉన్న కాస్త పొలం తాకట్టు పెట్టుకుని అప్పులిచ్చి వడ్డీకి వడ్డీ మెలేసి ఉన్న ఇంటివించి కూడా తరిమికొట్టగా ఎల్లయ్య ఇంటిని తన ఇల్లుగా చేసుకుని పుల్లయ్య కులుకుతుండగా, ఉన్న ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేక పోయిందిగా! ఇల్లాలు వెళ్ళిపోతే, సంతులేక ఒంటరిగాడై, కూలిపోతున్న రెండు ఇళ్ళూ చూసుకుంటూ, తాకట్టు పత్రాలు చదువుకుంటూ ఏ యమ్మయినా ఇంత గంజి పోస్తే తాగుతూ హరీ'మన్న పుల్లయ్య తన కంట్లో తానే దుమ్ము కొట్టుకోలేదా?

నడు నడు ముందుకు నడు!

మెత్తటి దుమ్ములో, సన్నటి దుమ్ములో అరికాళ్ళు గిలిగింతలు కాగా ముందుకు నడిస్తే ఆ చెట్టుకింద దుమ్ము కన్నీరు మున్నీరైపోతోంది. అక్కడే! అక్కడే పిచ్చిపిల్ల జానకి తాను మనసా వలచి తప్పక తాళికడ్తాడని నమ్మిన వయసుగాడు ఇంకొకత్తెని చేపట్టి పల్లకీలో ఊరేగుతూ వెళ్ళిపోతుంటే ఆ చెట్టుచాటున నుంచుని చూసింది. తన పెన్నిధి తనకు దూరమైపోగా, కళ్ళు కరిగిపోగా జల జల రాలిన కన్నీళ్ళు ఆ మట్టిలోనే ఇంకిపోయినాయి. ఇప్పటికీ తడియారని మట్టి అది. అంటుకుంటె 'అన్నా! నా జోలి నీకేల' అని తన దుఃఖంలో మునిగిపోతుంది.

ముందుకెళ్తే ఉప్పర సంగడి గుడిసె. సంగడు పెద్దవాడై మంచంలో పడి ఉంటే కూతురు లచ్చి కూలి చేసి గంజి పోస్తోంది. గుడిసె సగం కూలిపోయిందేం చెప్మా! సంగడు మట్టిలో పుట్టాడు. మట్టిలో బతికాడు. మట్టి కలిసాడు. ఈ వూరి ఇళ్ళ గోడలన్నీ మూడొంతులు వాడి చేతుల్తో కట్టినవే! వాడి గుడిసె గోడ పడిపోతే వాడు వేసుకోలేడు!

ఆ పైన అరవై ఏళ్ళ కమ్మరి సీతాలుకి కూడా మట్టే ప్రాణం. గబగబ కుండలు చేస్తోంది. చల్లటి కుండలు... అన్నం వండుకునే కుండలు, తిరగమోత కూరల చట్లు. పప్పుచార్లు... పాయసాలు... ఎంచక్కటి మూతలు... కాని ఇంత వయసొచ్చి వరన్నం ఎరగదు సీతాలు... ఆ పక్కన పలకలు... జ్ఞానపలకలు... బలపం పట్టుకుని స్వాతి ముత్యాల్లా 'ఓనమా...' దిద్దుకునే పలకలు... పెరిగి పెద్దై మేధావులై, పదిమందిలో గొప్పవారని పించుకుని ఆ పలకల్ని, ఆ సీతాల్ని మర్చిపోయిన ఓ అయ్యలారా, మట్టి ముందుకు రమ్మంటోంది! రండి.

ఓ అయ్య నాగలి బుజానికెత్తుకుని ఎదురొస్తున్నాడు. నేలని నమ్ముకున్న ఆ అయ్య! మనకి పెరుగన్నం, పాల బువ్వ అందించే ఆ అయ్య రెండు పూటలా సంకటే తింటాడు. ముద్దలో నేతి బొట్టు ఎరగడు. అయితేనేమి! ఆ కళ్ళల్లో దీక్ష, కండల్లో బలం, ఎత్తిన నాగలి, పైకెత్తిన ములుకోల. ఆ అంగల్లో రాజసం, ఆ మీసంలో పొంకం, ఆ చూపులో ఠీవి... ఇవన్నీ ఎక్కణ్ణించి వొచ్చాయి. ఆ అయ్య నేలతల్లి కొడుకయ్యా! ఓ తండ్రీ నీ నాగలికి అంటుకున్న మట్టి ఒకింత నాకియ్యవూ?

మట్టి పలుకుతోంది. మట్టి తుళ్ళి తుళ్ళిపడుతోంది. ఇది మహాపురుషుల పాదాలు తాకిన మట్టి. ఎద్దుల పావుకోళ్ళలో దూరి పాదాభివందనం చేసుకున్న మట్టి...

**రాజకీయ మంటే...!**

చెట్టు చాటు నుండి వాలిని చంపిన
శ్రీరాముడే నటుడు ఏం చెబుతాడో!
స్వగతంలో పలికేందు
అన్నీ తానేనని బోధించి
అందరినీ వంచించిన
శ్రీకృష్ణుడే నటుడు ఏం చెబుతాడో!
గజేంద్రుని రక్షణ కోసం పాదాభిషేకించిన
లక్ష్మీపతిని ప్రశ్నించు!
ముందు వర్షాలు సృష్టించు
ఆ పైన రక్షించే ఎంత వర్షి
అయితే రాజకీయం
ఎవరికో అశ్లీలమైనదో
ఎవరికీ ఎవరి తో మనువది-

— హిమజారమణ




ఎటు చూసినా మట్టి... కృష్ణ వొడ్డునిండా మట్టి... కృష్ణ గర్భంలో మట్టి, కృష్ణ అవతల మట్టి, వూరునిండా మట్టి... మట్టినిండా కథలు... మట్టినిండా చరిత్ర... తరతరాల మట్టి... యుగయుగాల మట్టి.

మనం మట్టిని మర్చిపోతున్నామా? తమ్ముడూ! చిన్నప్పుడు మనం గుప్పిళ్ళతో తిన్న మట్టి ఇదే! ఎంతో సాధించామనుకున్న తర్వాత వెళ్ళిపోతే మనం అయ్యేది ఈ మట్టే...

ఈ మట్టిని రేపుతాను... ఉవ్వెత్తుగా రేపుతాను... కథల కథల మట్టిని, మనిషి మనుషుల మట్టిని తుపానులా రేపుతాను.

ఇందులో దొర్లుతాను... పొర్లుతాను...వాళ్ళంతా చల్లుకుంటాను. వొళ్ళంతా మట్టి విభూది పూసుకుని కళ్ళు ఎప్పుడు మట్టి కడుపులోకి చూస్తాను.

"తల్లిని మర్చిపోతున్నార్రా చిన్నారులూ," అంటోంది నేలతల్లి.

మట్టిని మర్చిపోతున్నాం. మనుషుల్ని మర్చిపోతున్నాం.

నాకు మట్టి పిచ్చి ఎక్కిందని తమరనుకోవచ్చు.

నా లాగా ఈ మట్టి పిచ్చి నా తోటి జనులకు ఎప్పటికొచ్చునో! ఎప్పుడు నా వారంతా మట్టిని, మట్టిలోని మనుషుల్ని కౌగిలించుకుందురో?...